# చివరకు మిగిలేది?

ఉత్సాహం బుగ్గ పుట్టినట్టు లేచింది, నరహరికి.

ఆయన ఉత్సాహం చూసి, " బతికేదే బరువై పోతావుంది. ఈ మాదిరి పన్లు పెట్టుకుని గబ్బులేపుకోకు " అని హెచ్చరించాడు, నారాయణ.

"పెద్ద పెద్దగా ఆస్తులున్నోళ్లు యదపడాల, నాకే మబ్బా" అని " గట్టిగా ఆలోచించే ఈ పని చేయాలనుకున్నా, పని తూగిస్తాననే నమ్మకం. " అన్నాడు నరహరి.

" సరే కానీ " అంటూ కదిలినాడు నారాయణ.

గట్టుమీద కూచుని ఎదురుగా చూసినాడు నరహరి. ఏ అదృశ్య రాక్షసులో అపోశన పట్టినట్టు నీరింకిపోయిన చెరువు. ఆకాశం మీద గొడ్డుమోతు మేఘాలు.

ఐదెకరాల మెట్ట సేద్యంతోనే బతుకును వెల్లదీస్తున్నాడు నరహరి. ఒక ఎకరా చెరువు కింద భూమి వుంది, గానీ, అది ఊహకి వున్న భూమే. చెరువు నిండేదీ లేదు, ఆ భూమిలో పైరు

పెట్టుకునేదీ లేదు. నిరాశగా వెనక్కి తిరిగి మెట్టపొలం కాడికి నడిచినాడు నరహరి.

పుటికలో సంగటిని పెట్టుకుని పొలం కాడికి వచ్చింది చంద్రమ్మ. నీళ్ళు, మజ్జిగా, ఒక ఎఱ్ఱగడ్డ కూడా తెచ్చింది.

నరహరికి అన్నం పెడుతోంది, " సంసారం జరిగేదే కష్టంగా వుంది. ఆయకం రాయించి అప్పు తెచ్చుకుని - ఈ పని జేయకపోతే ఏం. మనిద్దరం గాక ముగ్గురి పొట్టలు గడవాలా. పిల్లది ఎదిగి కూర్చుంది. తన్నో అయ్యచేత పెట్టాల. ఎట్టబ్బా ఈ కరువు రోజుల్లో బతికేది. అని నేను ఆసోదులేకుండా ఆలోచిస్తా వుంటిని. " అన్నది చంద్రమ్మ.

తలఎత్తి పెండ్లాం కళ్ళల్లోకి జూసినాడు నరహరి. 'కొట్లాడి రంపుజేసే మడిసి కాదు చంద్రమ్మ. మనసులో మాట చెప్పింది. ఆదే నా అదురుష్టం' అనిపించింది. చంద్రమ్మది చక్కని రూపం. మంచి పలుకు. కష్టసుఖాల విచక్షణవుంది. అల్ప సంతోషి. ఏదో కూటికీ గుడ్డకూ కొరతలేకుండా రోజులు గడిచిపోతే చాలు అనుకుంటుంది. ఎప్పుడూ రెక్కల కష్టానికి సిద్దమే. చంద్రమ్మ భార్యగా రావడమే తన అదృష్టం.

నరహరి మౌనం చంద్రమ్మనీ మౌనంలో పడేసింది. అయినా తను పట్టించుకోకుండా వుండలేని విషయం ఇది. అందుకే మళ్ళీ అంది, " ఆదాయం ఆడికాడికీ సరిపోతావుంది. ఇప్పుడీ అప్పెందుకా అని... "నీళ్ళు నమిలింది.

నరహరి తిండి తినడం అయ్యింది. చెయ్యికడుక్కొని మూతి తుడుచుకున్నాడు.

“ డిపార్ట్‌మెంట్ వాళ్లూ, సిద్ధాంతిగారూ ఖాయం చేశారు. నా కెందుకో నమ్మకంగా వుంది. అదృష్టం బాగుంటే కష్టాలన్నీ గట్టెక్కుతాయ్. ” అన్నాడు.

చంద్రమ్మ ఇంకేమీ మాట్లాడేందుకు వీలు గాలేదు. కడాకు నిట్టూర్పుతో కదిలినాది.

*　　　*　　　*

రాత్రి తొమ్మిది గంటలయ్యింది.

ఊరు నిద్ర పోలేదు.

రచ్చబండ హడావిడిగా వుంది.

తూర్పువీధి రంగయ్యమావ అక్కడే కొలువు తీర్చినాడు. నలుగుర్నీ తోలుకొచ్చినాడు.

“ నరహరి గంగని బూమ్మీనకి తెస్తాడంట. బాయి తొవ్వాలని పతకాలేస్తున్నాడు. ”

వార్తకి తగిన వెటకారం జోడించినాడు.

నరంలేని నాలుకలు మెలికలు తిరగసాగినాయి.

కొందరు – ‘ అయ్యో పాపం ’ అన్నారు. పడమర వీధి పద్దమ్మ ‘ చంద్రమ్మకి కషాలొచ్చినయ్ ’ అంటే, ‘ నువ్వే సూచొచ్చినావా ’ అని ఇంతెత్తున లేచినాది భారతమ్మ.

రంగయ్య మావ వివరం సెప్పినాడు. " నే పుట్టిన కాడ నుండీ జూస్తావుండా మన గడ్డన తేమ గనపడ్డాదా, ఈ మాత్రం లెక్క మా తాతల కాలం నుంచీ పెట్టలేకపోయామా ? "

నారాయణ కల్పించుకుని అన్నాడు, ' మామా, నాకు తెలీకడుగుతాను. అందరూ చేతులు కట్టేసుకున్కూచోవాలా ? ఎవరద్దుట్టం ఎట్టాగుందో. ప్రయత్నకం చెయ్యనీ. "

గూడెంలో వడ్డెర్ల పెద్ద నాగన్న కూడా ' ఎవరికష్టం వాళ్ళు సూసుకోవాల. అయనగారికి బుద్ధి పుట్టింది. సెయ్యనియ్యండి ' అన్నాడు.

అంతటితో సద్దుమణిగింది.

అక్కడ — ఇంటికాడ —

వరహారి - ఆ రాత్రి కునుకు తియ్యలేదు. ఏవేవో కలలు. అదేదో సినిమాలో గంగ దిగిరావడం జూపినారు. అదే కల. ఇంకెక్కడో బూమ్మీద బాణమేసి కొడితే బుగ్గ పుడుతుంది.

అదే వూహ, కళ్ళు తెరిచినా, మూసినా - నీళ్ళు ... నీళ్ళు ... నీళ్ళే కనిపించినై.

చంద్రమ్మ కొంగు పరచుకుని చూరు జూస్తా పడుకుంది. కీడెంచి మేలెంచమన్న సామెతే గుర్తుకు రాసాగింది ఆమెకు.

సరస్వతీ ఆలోచిస్తున్నది. ఆమె మనస్సులో తండ్రి పట్ల గట్టి నమ్మకం వుంది. తండ్రి కష్టజీవి అనీ, ధర్మాత్ముడనీ ఆమెకు తెలుసు. మంచోళ్ళకు దేవుడు సాయం జేయాల అని మొక్కుకుంటూ పండుకొనింది.

ఓబులేసు, ఈశ్వరమ్మా సాయంత్రమంతా తమ జత స్నేహితులతో బాయి సంగతులు చెప్పుకుని సంబరంగా నిద్ర పోయారు.

పొలిమేరలో ఎక్కడో కుక్కలు మొరుగుతున్నై.

*  *  *

పూజ పూర్తయింది. దేవునికి దణ్ణం పెట్టుకున్నాడు నరహరి. టెంకాయ కొట్టినాడు. గడ్డపారతో మూడేట్లు ఏసినాడు. కళ్ళల్లో ఆశల వత్తులు వెలిగించుకుంది చంద్రమ్మ. కూలోల్లు పనిలోనికి దిగినారు. బావి పని మొదలైనాది.

రెండో రోజు సాయంత్రానికి ఒక మట్టు తొగినారు.

మరో వారం గడిచింది. పని త్వరగా సాగుతోంది. మూడు మట్లు తెగినాయి.

వరహరికీ చంద్రమ్మకీ ఈ పదిరోజులూ రాత్రిళ్లు నిద్ర లేదు. పెద్దపిల్ల సరస్వతికీ అంతే. కొడుకు ఓబులేసుకీ, చిన్న పిల్ల ఈశ్వరమ్మకీ ఈ బాధలు తెలిసే వయసు లేదు. ఎంద రెందరో దేవుళ్లకి మొక్కుకుంటూ రోజులు గడుపుతున్నారు నరహరి, చంద్రమ్మ.

పన్నెండోరోజు రాత్రి నాలుగో మట్టు తెగింది. చెమ్మ పడింది! అందరి కళ్లల్లోనూ మెరుపు!

రాత్రంతా నరహరి, చంద్రమ్మ, సరస్వతీ అక్కడే నడుం వాల్చినారు. ఏవేవో ఊసులు, ఎన్నెన్నో ఊహాలు. చేతిలో

లెక్క అయిపోవచ్చింది. ఇంతటితో నీరు పడితే అదృష్టంవే లేకపోతే ... అంతలో ఆనందం, ఆశ. అంతలో సందేహం, భయం, నిరాశ.

మర్నాడు-మరో అరమెట్టు తెగింది. అదంతా బండ!

"నరహరి బావిలో బండ పడింది-" ఊరంతా అట్టుడికి నట్టు ఉడికిపోయింది-వార్త. వెక్కిరించే నొసళ్లు కదిలినై.

నరహరి గుండెల్లోనూ రాయి పడింది. చేతిలో లెక్క నిండుకుంది. ముందు నుయ్యీ, వెనుక గొయ్యీ అన్న సామెత నిండుగా నప్పింది. ఒక్కసారిగా ముసలివాడయిపోయినట్లు బాధ పడినాడు. బావి చుట్టూ తిల్లాడుతాడు. ఎవరికేం చెప్పాలో, ఎట్టా చెప్పాలో తెలీటం లేదు. బితుకు బితుగ్గా తిరుగుతున్నాడు. కొత్త కష్టాన్ని కొని తెచ్చుకున్నట్లయ్యింది.

-తెల తెలవారుతోంది. నేలమీద గుడ్డ పరచుకుని పడుకున్నాడు నరహరి. దూది పింజెల్లా తేలిపోతున్న మేఘాన్ని చూస్తూ ఆలోచనల్ని మేస్తున్నాడు. చంద్రమ్మా సరస్వతీ - ఇంటికి పోయినారు. తెల్లారితే కూలీలు వస్తారు. ఏం చేయాలి ?- ఇదీ నరహరి సమస్య. వేపచెట్టు గాలి దేహాన్ని మాత్రం సేద దీరుస్తోంది.

నారాయణ వచ్చాడు నిమ్మళంగా. నోట్లో వేపపుల్ల వుంది.

లేచి కూర్చున్నాడు నరహరి.

"ఇప్పుడు దిగులు పడితే ఎట్లా పని జరగాల. బగమంతుడి మీద బారమేసి ముందుకే పోదాం. లెక్క సంగతి

నే జూస్తాలే. లెయ్, మొగం గడుక్కో. ఈ దినం బాగుండాలని కోరుకుందాం. కీటు పెట్టిద్దాం." నారాయణ అనునయంగా అన్నాడు.

నరహరికి ధైర్యంవొచ్చింది. సాక్షాత్తూ ఆ నారాయణుడే దిగివచ్చినట్లనిపించింది. తనకున్న సర్వమూ ఇంటితో సహా నారాయణకి రాసిచ్చి, లెక్క తీసుకున్నాడు నరహరి.

ఆ దినం కీటు పెట్టినారు. మందు కూరి దట్టించి పేల్చినారు.

*　　　*　　　*

మునాసగా కృషి చేసి, అనుభవాల పుట్టగా, అప్పుల గుట్టగా, మిగిలిన రైతు సోదరుడు నరహరి.

ఊళ్ళో మొండిచేతుల ముష్టివాడుగా మిగల దల్చుకోక — ఇదుగో ఇక్కడికొచ్చాడు.

దయచేసి మీరుగా అతన్నేమీ అడక్కండి.

చెట్టుకింద రిక్షావాడుగా అట్టా వుండనీయండి!

0~0~0